

దేహ దారుఢ్య పరీక్షలు

కానిస్టేబుల్ ఎంపికల్లో దేహ దారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. అభ్యర్థులు రాణించారు. - 8లో



బయటపడిన మోసం

నకిలీ బ్యాంకు రశీదుల మోసం బయటపడింది. సీఎఫ్ సొంత అవసరాలకు వాడినట్లు తేలింది. - 8లో

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ఏయూ పరిధిలోని డిగ్రీ 2019 ప్రవేశాల బ్యాచ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఇన్‌చార్జి అండ్ గ్రాడ్యుయేషన్ ఎగ్జామినేషన్స్ డీన్ జి.పద్మారావు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 1, 3, 5 సెమిస్టర్ల పరీక్షలకు ఫీజులు విద్యార్థులు చెల్లించాలని ఆయన తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా జనవరి 10లోపు ఫీజులు చెల్లించాలని సూచించారు.

న్యూస్‌రీల్

నూతన సంవత్సర వేడుకలకు ధర్మాన దూరం



మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పెద్దపాడులోని క్యాంపు కార్యాలయంలో ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకల్ని రద్దు చేశామని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థిక వేత్త మన్మోహన్‌సింగ్ మృతికి సూచకంగా సంతాపం దినాల్ని పాటిస్తున్నందున వేడుకల్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేసేందుకు, వ్యక్తిగతంగా తనను కలిసేందుకు ఎవ్వరూ రావద్దని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలందరికీ నూతన ఏడాది శుభాకాంక్షలు తెలిపారు.

94 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీలు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అర్జీలు స్వీకరించారు. 94 అర్జీలు స్వీకరించగా ఇందులో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సర్వే అండ్ లాండ్ రికార్డులు, ఏపీ టౌన్‌షిప్, ఏపీ హౌసింగ్, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్, ఏపీఈపీడీసీఎల్, పశుసంవర్ధక శాఖ, స్కిన్ డెవలప్‌మెంట్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, విభిన్న ప్రతిభావంతులు, గ్రామీణాభివృద్ధి, వాటర్ రిసోర్సెస్, మెడికల్ ఎడ్యుకేషన్, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ రూరల్ పావర్టీ, స్కూల్ ఎడ్యుకేషన్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, ట్రెజరీ, దేవదాయ శాఖ, మైన్స్ అండ్ జియాలజి శాఖలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జడ్పీ సీఈఓ ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా ఉండగా, ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 38 వినతులు



వినతులు స్వీకరిస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం పరిష్కార వేదిక (ఎస్పీ గ్రీవెన్స్)కు అర్జీదారుల నుంచి 38 వినతులు అందాయి. శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ముఖాముఖిగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

సీఐ పైడపునాయుడుకు ఉత్తమ ప్రతిభా అవార్డు



సీఐ పైడపునాయుడుకు అవార్డు అందజేస్తున్న సీఐడీ అడిషనల్ డీజీపీ రవిశంకర్ అయ్యనార్, ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ సీహెచ్ పైడపునాయుడుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 2024 వార్షిక రోలింగ్ అవార్డు దక్కింది. సోమవారం మంగళగిరిలో ఉన్న డీజీపీ కార్యాలయంలో సీఐడీ అడిషనల్ డీజీపీ రవిశంకర్ అయ్యనార్, ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ చేతుల మీదుగా ఈ అవార్డును పైడపునాయుడు అందుకున్నారు. విశాఖపట్నంలో సీఐడీ విభాగంలో సీఐగా ఉన్నప్పుడు ఆర్థిక నేరాల ఛేదనలోను, నేరస్తులను పట్టుకోవడంలో పైడపునాయుడు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రధానంగా జయలక్ష్మి సొసైటీ కేసు దర్యాప్తు జరిపి రూ. 450 కోట్ల ఆస్తులను సీజ్ చేయడంలో పైడపునాయుడు కీలకపాత్ర పోషించడంతో ఈ అవార్డు వరించింది. రాష్ట్రంలో ఈయనతోపాటు మరో ఐదుగురికి అవార్డు రావడం విశేషం. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, డీఎస్పీ సీహెచ్ వివేకానందలు సీఐకి అభినందనలు తెలిపారు.



నూతన వేడుక.. కొంచెం ట్రెండీగా

● మార్కెట్‌కు న్యూ ఇయర్ జోష్ ● అభిరుచులకు తగ్గట్టుగా సామగ్రి సిద్ధం

ప్లాస్టిక్ పూల తరం పోయి.. సహజమైన బొకేల సంప్రదాయం వచ్చింది. సాధారణ కేక్‌ల జమానా పోయి థీమ్ కేక్‌ల యుగం రాజ్యమేలుతోంది. సరికొత్త డిజైన్లతో డైరీలు, కొంగొత్త రూపాల్లో గ్రీటింగ్ కార్డులు, తీరొక్క రీతుల్లో గిఫ్టులతో నూతన వత్సర వేడుకకు రంగం సిద్ధమైంది. మార్కెట్ నిండా ఇప్పుడు ఈ సరుకే కనిపిస్తోంది. మరోవైపు మొక్కలు బహుమతిగా ఇచ్చే సత్సంప్రదాయం కూడా కొనసాగుతోంది. ఈ సరదా సందడి నడుమ నూతన ఏడాదికి సరికొత్తగా స్వాగతం పలకడానికి జనమంతా సన్నద్ధమవుతున్నారు. – శ్రీకాకుళం కల్చరల్







న్యూఇయర్ కోసం ప్రత్యేకంగా సిద్ధమైన కేకులు



నూతన సంవత్సరం కోసం బొకేలు సిద్ధం చేస్తూ...

బొకే.. లైవ్ అయితే ఓకే

ప్లాస్టిక్ పలకరింపులకు, ప్లాస్టిక్ అభినందనలకు కాలం చెల్లిపోయింది. వీటితో పాటు ప్లాస్టిక్ పూల బొకేలు కూడా పాత ట్రెండైపోయాయి. ఓ గుప్పెడు సన్నజాజులు గుదిగుచ్చిన బొకే ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడం ఇప్పుడు మర్యాద. గులాబీలు గుభాళిస్తుండగా ఆ పూల గుత్తిని తీసుకెళ్లి పలకరించడం గౌరవం. మన బంతి పూలు, రోజాపూలు పాత ట్రెండు కదా.. అని ఫీలయ్యే వారి కోసం బెంగళూరు నుంచి కుసుమాలను తెప్పించి వాటికి మన పువ్వులను జత కలిపి బొకేలు తయారు చేస్తున్నారు. డిజైన్లన్నీ మొహం మొత్తేశాయండీ.. అని అనుకోకుండా ప్రత్యేకంగా ప్లాస్టిక్ కప్పులు, ఫోం, సెలిన్ పేపర్, రిబ్బన్‌లను ఉపయోగించి అందమైన బొకేలను రూపొందిస్తున్నారు. పూవులను కాదు పండ్లను కూడా అందంగా ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు.

కేక్.. ట్రెండీ లుక్



అర్ధరాత్రి పూట కేక్‌పై కత్తి పెట్టకపోతే న్యూ ఇయర్ వచ్చినట్టే ఉండదు. ఆ కేక్‌లు కూడా సాధారణంగా ఉంటే సెలబ్రేషన్ కిక్ ఇవ్వదంటున్నారు కొత్త తరం యువకులు. కొత్త ఏడాదికి సరికొత్త డిజైన్ కేక్‌తో మాత్రమే స్వాగతం చెప్పాలని నిశ్చయించుకున్నారు. అందుకే వారి అభిరుచికి ఏ మాత్రం తీసిపోకుండా, రుచి ఎంత మాత్రం తగ్గకుండా బ్యాకరీలు ట్రెండీ డిజైన్లతో సిద్ధంగా ఉన్నాయి. రోజంతా రద్దీ ఉంటుంది కాబట్టి.. థీమ్ కేక్‌లను ముందుగానే సిద్ధం చేస్తున్నాయి.

క్యాలెండర్, డైరీలు సిద్ధం

మార్కెట్‌లో క్యాలెండర్లు, డైరీలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. ఏటికేటా డైరీలు కొంగొత్త హంగులతో తయారవుతున్నాయి. పెద్దవాళ్లకు గిఫ్ట్ ఇవ్వడానికి ఈ డైరీలను కొనుగోలు చేస్తున్నారు. ఒకప్పుడు రాజ్యమేలిన గ్రీటింగ్ కార్డులు కూడా మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. గ్రీటింగ్ కార్డులు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పుకోవడం ఓ మధుర జ్ఞాపకంగా పొందిన తరమంతా గ్రీటింగ్ కార్డుల కొనుగోలుకు సిద్ధమవుతున్నారు.



ఈవెంట్ టిక్కెట్లు కొనుగోలు చేస్తూ...



కల్చరల్ నైట్

నగరానికి దూరంగా నూతనంగా నిర్మిస్తున్న ఒక ప్రైవేటు హోటల్ యాజమాన్యం నూతన సంవత్సర వేడుకల కోసం టీవీ కమేడియన్‌లతో ఒక షో నిర్వహిస్తున్నారు. ఇప్పటికే టిక్కెట్ల విక్రయాలు మొదలయ్యాయి. ఆన్‌లైన్‌లో కూడా టిక్కెట్లు అమ్మకం సాగిస్తున్నారు.



సిద్ధమైన ఫ్రూట్ బాస్కెట్లు

బొకేలకు డిమాండ్




ఏటా ఈ సీజన్‌లోనే ఎక్కువగా బొకేల అమ్మకాలు జరుగుతాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా మేము బెంగళూరు నుంచి పూలను తెప్పించుకొని బొకేలను సిద్ధం చేస్తున్నాం.

– యాగాటి ప్రసాద్, ఫ్లవర్ స్టాల్ నిర్వాహకుడు

క్లోజింగ్ టైమ్ 12:30

● అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఊరుకోం ● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం క్రైమ్ : కొత్త ఏడాదిని స్వీయ భద్రతతో ప్రారంభిస్తామని, మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతే ధ్యేయంగా పనిచేస్తామని, అసాంఘిక, అరాచక శక్తులను అణిచివేస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. నూతన సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎస్పీ ప్రకటన జారీ చేశారు.

అర్ధరాత్రి 12:30 గంటలకు అన్నీ క్లోజ్..

31 అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత రోడ్లపై ఎవరూ తిరగరాదని, బార్ అండ్ రెస్టారెంట్లు, హోటళ్లు, ఇతర దుకాణాలు రాత్రి 12:30 గంటలకల్లా మూసేయాల్సిందేనన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, రహదారులపై న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించరాదన్నారు. మద్యం సేవించి (డ్రంక్ అండ్ డ్రైవ్) వాహనాలు నడపరాదని, సైలెన్సర్లు తీసి పెద్ద శబ్దం చేయరాదని, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేస్‌లు, ట్రిపుల్ రైడింగ్ చేస్తే ఊరుకునేది లేదన్నారు. తల్లిదండ్రులు (బంధువులు) మైనర్లైన తమ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, కారుల్లో పార్టీల కోసం వచ్చేవారు మద్యం తాగని వారిని డ్రైవర్‌గా పెట్టుకోవాలన్నారు. ప్రతి కూడలిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పై నిబంధనలు అతిక్రమించినవారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

అనుమతి తప్పనిసరి..

ఈవెంట్ల నిర్వాహకులు కచ్చితంగా అనుమతి తీసుకోవాలని, లేదంటే చర్యలు తప్పవన్నారు. బహిరంగ ప్రదేశాల్లో కేక్ కట్ చేయడం, పార్టీలు, డీజే /లౌడ్ స్పీకరు పెట్టి పెద్ద పెద్ద శబ్దాలు చేయడం, డ్యాన్స్‌లు చేసి న్యూసెన్సు క్రియేట్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అదే సమయంలో మహిళలు, యువతులను ఈవ్‌టీజింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని, హోటళ్లు, రెస్టారెంట్లలో జరిగే ప్రత్యేక కార్యక్రమాలకు ఎలాటి అనుమతులు లేని అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఊరుకునేది లేదన్నారు.

గస్తీ గట్టిగా ఉంటుంది..

డిసెంబరు 31 రాత్రి పోలీస్ పికెట్స్, నైట్ గస్తీ బృందాలు అలెర్ట్‌గా ఉంటాయని, అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు జరగకుండా వాహనాలను తనిఖీ చేస్తారన్నారు. ముఖ్య రహదారి మార్గాల్లో పటిష్ట బందోబస్తు ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని, ఇళ్ల వద్ద జరుపుకుంటే మరింత మంచిదని తెలిపారు.



తిందాం హాయిగా..



శ్రీకాకుళం: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలోని 90 శాతం రెస్టారెంట్లలో పలు రకాల ఆఫర్లను యాజమాన్యాలు ప్రకటించాయి. వీటిలో ఎక్కువగా బఫేకు ప్రాధాన్యత ఇస్తూ ప్రకటనలు చేస్తున్నాయి. రూ.699 నుంచి రూ.1200 వరకు ఆయా మెనూలను బట్టి ధరలు నిర్ణయించారు. శాఖాహార, మాంసాహార రుచులు ఇందులో ఉంటున్నాయి. కొన్ని రెస్టారెంట్లలో సరికొత్త వంటకాలను పరిచయం చేస్తూ మెనూ రూపొందిస్తున్నారు. చిన్న రెస్టారెంట్లలో 10 నుంచి 15 శాతం రాయితీని, ఇంకొందరు కాంబో ప్యాక్‌లు అంటూ రకరకాల వంటకాలతో ధరలను నిర్ణయించి ప్రకటిస్తున్నారు. రూ.400 మొదలు కొని రూ.2,500 వరకు ఈ కాంబో ప్యాక్ ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని రెస్టారెంట్లు డిసెంబర్ 31వ తేదీ రాత్రి 12.30 గంటల వరకు నిర్వహించేందుకు అధికారులు వెసులు బాటు కల్పించగా అందుకు తగ్గట్టుగా వ్యాపారులు సిద్ధం అవుతున్నారు.

బహుమతిగా బుజ్జి మొక్క

గ్రీటింగ్ కార్డులు, డైరీలు, క్యాలెండర్లు, పెన్నులు బహుమతులుగా ఇవ్వడం కంటే ఓ బుజ్జి మొక్కను బహుమతిగా ఇవ్వడం సబబుగా ఉంటుందని చాలా మంది భావిస్తున్నారు. జిల్లా కేంద్రంలో బోలెడు రకాల పాట్ ప్లాంట్స్ అందుబాటులో ఉన్నాయి. అలాగే ఇంటి వద్ద అందంగా ఉంచుకునే బోన్సాయ్ మొక్కలు కూడా ఇవ్వవచ్చు. నగరంలో లభ్యమవుతున్న బుజ్జిబుజ్జి బోన్సాయ్‌ల ప్రత్యేకతలు ఇలా ఉన్నాయి.



ఫైకాస్
వయసు: ఏడున్నర సంవత్సరాలు
ఖరీదు: రూ.1500
గుబురుగా కాండం మాత్రం పెరుగుతుంది. దీన్ని పూనా నుంచి తీసుకొని వచ్చి అమ్ముతున్నారు.



ఎడానియం
వయసు: 7 ఏళ్లు
ఖరీదు: రూ.1500



ప్రచీర
వయసు : 7ఏళ్లు
ఖరీదు: రూ.1500



ఎంతోరియం
ఖరీదు: రూ.200
ఈ మొక్కను గృహ శోభ కోసం పెంచుకోవచ్చు.



లిప్‌స్టిక్ ప్లాంట్
ఖరీదు: రూ.200
ఇంటిలో ఆక్సిజన్ లెవెల్స్ పెంచుతుంది.




జడ్‌జడ్ ప్లాంట్
ఈ ప్లాంట్ ఇంట్లో ఆక్సిజన్ లెవెల్స్ పెంచుతుంది.

ఇవి కూడా.. మార్కెట్‌లో వ్యక్తిత్వ వికాస పుస్తకాలు దొరుకుతున్నాయి. వాటిని కూడా చాలా మంది బహుమతిగా ఇస్తారు. మనకు ఇష్టమైన వాళ్లకి మంచి మంచి స్ఫూర్తివంతమైన సూక్తులు ఉన్న ఫోటో ఫ్రేమ్‌లు కూడా ఇవ్వవచ్చు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్లు భద్రపరిచే గోడౌన్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. గోడౌన్‌కు వేసిన సీళ్లు, ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ప్రతీ త్రైమాసికంలో ఈవీఎం, వీవీ ప్యాట్ గోడౌన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.



ఈవీఎం గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పింఛన్‌దారులు వారి లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని ఖజానా శాఖ డీడీ సీహెచ్ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వారి లైఫ్ సర్టిఫికెట్లను 2025 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 లోగా అందజేలని తెలిపారు. నేరుగా, లేదా ఆన్‌లైన్ ద్వారా అందజేయవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో సీఎఫ్ఎంలోని పింఛన్ లాగిన్ ద్వారా ఎస్ఐసీ జీవన్ ప్రమాణ్ ద్వారా సబ్మిట్ చేయాలని తెలిపారు. సకాలంలో లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వకపోతే మార్చి తర్వాత పింఛన్ నిలిచిపోతుందన్నారు. ఇప్పటి వరకు పింఛన్ లైఫ్ సర్టిఫికెట్ అందజేయని వారు దగ్గరలో ఉన్న సబ్ ట్రెజరీ ఆఫీసులో అందజేయాలన్నారు. నేరుగా అందజేయలేని వారు ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే అందులో ఎస్ఐసీ జీవన్ ప్రమాణ యాప్ అలాగే ఆధార్ ఫేస్ రికగ్నైజర్ యాప్ లను ఇన్‌స్టాల్ చేసుకుని ఇంటి వద్దనే లైఫ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయవచ్చునని తెలిపారు.

రథసప్తమికి ఘనంగా ఏర్పాట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర పండుగగా ప్రకటించిన అరసవల్లి రథసప్తమి వేడుకలను జిల్లా సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టి పడేలా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలు శోభాయాత్రతో ప్రారంభమై, సంప్రదాయ క్రీడలు, లేజర్‌షో, బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాలతో జరుగుతాయని, లక్షలాది మంది భక్తులను ఆకర్షించే ఈ వేడుకల కోసం శ్రీకాకుళం నగరాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలని నిర్ణయించారు. ప్రధాన కూడళ్లలో బ్యూటిఫికేషన్ కార్యక్రమాలు చేపట్టాలని, ఫౌంటేన్లు నిర్మించాలని సూచించారు. రథసప్తమి వేడుకలు జిల్లా ప్రతిష్టను పెంచుతాయని, ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు.

క్లుప్తంగా

సీఏఎస్ ఇంటర్వ్యూలు వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఒక సీనియర్ ప్రొఫెసర్, ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్ల ఉద్యోగ ఉన్నతులకు సంబంధించి సోమవారం జరగాల్సిన సీఏఎస్ (కెరియర్ అడ్వాన్స్ స్కీమ్) ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. అధికారులు నిర్వహణకు ముందుకు వచ్చినా, చివరి క్షణంలో ఉన్నత విద్యాశాఖ ఇంటర్వ్యూలు వాయిదా వేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. పాలక మండలి అనుమతులు లేకుండా ఇంటర్వ్యూలకు అధికారులు సిద్ధపడడం, సీనియర్ ప్రొఫెసర్ సీఏఎస్‌లో నిబంధనలు అమలు చేయటం లేదంటూ విద్యాశాఖకు అధిక సంఖ్యలో విశ్వవిద్యాలయ పరిరక్షణ కమిటీ పేరుతో ఫిర్యాదులు వెళ్లాయి. సీఏఎస్ ఇంటర్వ్యూలు పూర్తయినా పాలక మండలి, ఉన్నత విద్యాశాఖ అనుమతుల తర్వాతే ఉద్యోగ ఉన్నతులు లభిస్తాయి. ప్రస్తుతం వర్సిటీలో అకడమిక్ సెలవులు కొనసాగుతున్నాయి. అయినా సీఏఎస్ ఇంటర్వ్యూల నిర్వహణకు అధికారులు సిద్ధపడ్డారు.

నూతన విధానాలు అవలంభించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు


ఆమదాలవలస: నూతన ఆక్వా కల్చర్ విధానాలను అవలంభించి, వాతావరణంలో మార్పులతో వచ్చే వ్యాధులను సకాలంలో గుర్తించడం, నివారణ చర్యను చేపట్టడంపై మత్స్యకార రైతులు అవగాహన కలిగి ఉండాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి సౌజన్యంతో కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో సోమవారం మత్స్యశాస్త్రం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు, రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పద్ధతులను విడిచి, సాంద్ర పద్ధతుల్లో సాగు చేపట్టినట్లయితే అధిక దిగుబడుల సాధించడం సాధ్యమవుతుందన్నారు. వీటికి అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో వినూత్న చేపల పెంపక విధానాలైనటువంటి చేపల పెంపకం విధానం హర్ష ఆక్వాకల్చర్ యూనిట్ సందర్శించారు. కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు, అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, రమణమూర్తిలు పాల్గొన్నారు.

పేరుకు విలేకరులు.. తీరుకు కింకరులు



నగరంలో ఓ భవన నిర్మాణ ప్రాంతం.. పనిలో బిజీగా ఉన్న యజమాని వద్దకు ఓ నలుగురు వస్తారు. 'నీకు పర్మిషన్ ఉందా.. అధికారులు తెలుసా..' అని బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తారు. సరిగ్గా అదే టైమ్‌లో మరో వ్యక్తి సీన్‌లోకి ఎంటరై 'అరెరె.. యజమాని నా స్నేహితుడేనే' అంటూ మాట కలుపుతాడు. యజమాని తరపున మాట్లాడుతున్నట్లు నటించి తిరిగి అతని చేతే డబ్బులు ఇప్పిస్తాడు.. ఇదేమీ తెలుగు సినిమా సన్నివేశం కాదు. జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన ఓ యదార్థ ఘటన. విలేకరులుగా చెలామణీ అవుతున్న కొందరు చేస్తున్న దందాకు ఓ ఉదాహరణ.

- మున్సిపాలిటీ అధికారుల పేరు చెప్పి 'విలేకరుల' దందా
- రూ.లక్ష ఇవ్వాలని బ్లాక్‌మెయిలింగ్



శ్రీకాకుళం క్రైమ్:

పాత్రికేయులమంటూ చెప్పుకొని జిల్లా కేంద్రంలో కొందరు దందా చేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారుల పేరుతో భయపెట్టి నిర్మాణంలో ఉన్న భవనాల వద్దకు వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారు. శ్రీకాకుళం బలగ మెట్టు డీసీసీబీ బ్యాంకు సమీపంలో నివాసముంటున్న దంపతులు వీరి బారిన పడి బెంబేలెత్తిపోయారు. రూ.లక్ష ఇవ్వందే కదలబోమని 'విలేకరులు' భీష్మించుకుని కూర్చోవడంతో రాత్రి రెండు గంటల సమయంలో ఆపసోపాలు పడ్డారు. రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు, బాధిత దంపతులు బరాటం నాగరాజు, సౌజన్య తెలిపిన వివరాల్లోకి వెళ్తే..

నాగరాజు డీసీసీబీ బ్యాంకు ఎదురుగా రెండు ఫ్లోరులున్న ఇంటిలో భార్య సౌజన్య, ఇద్దరు కుమార్తెలు, మానసిక వికలాంగుడైన తన తమ్ముడితో కలసి నివాసముంటున్నాడు. నాగరాజు హెరిటేజ్ షాపు పెట్టి జీవనం సాగిస్తున్నాడు. మానసిక వికలాంగుడైన తన తమ్ముడి కోసం పై ఫ్లోరుకు శ్లాబ్ వేసి గదిలా నిర్మిద్దామనుకున్నాడు. ఉదయం పూట పాల బిజినెస్‌తో పాటు టీషాపు నడుపుతుండటంతో పని ఎక్కువై శ్లాబ్ వేస్తామన్న మేస్త్రీ రాజుతో మాట్లాడి ఆదివారం రాత్రి 10 గంటలకు ముహూర్తం పెట్టుకున్నారు.

ఏం జరిగిందంటే..

రాత్రి 10.30 గంటల సమయంలో జిల్లా కేంద్రంలో విలేకరులుగా చెలామణీ అవుతున్న బొడ్డు కృష్ణారావు, తిత్తి ప్రవీణ్, వాసు, మరో వ్యక్తి కలిసి అక్కడకు వచ్చారు. వచ్చీ రాగానే 'ఈ టైమ్‌లో కడుతున్నావు.. ప్లానుందా.. పర్మిషనుందా.. మున్సిపాలిటీ వాళ్లు రారనుకున్నారా..' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో ఆ ఇంటి యజమాని బిక్కచచ్చిపోయారు. ఈ లోగా మరో 'పాత్రికేయుడు' డోల అప్పన్న అక్కడకు వచ్చారు. 'మీరేంటిరా ఈ టైంలో ఇక్కడ ఉన్నారు' అంటూ కృష్ణారావు తదితరులను అడుగుతూనే బాధితుడైన నాగరాజు తన క్లాస్‌మేట్ అని వదిలేయాలని మాట్లాడడం మొదలుపెట్టాడు. మధ్యవర్తిగా మాటలు మొదలుపెట్టిన డోల అప్పన్న రూ.60వేలకు బేరం కుదిర్చాడు. దీంతో అతని తీరు చూసి నాగరాజుకు మాట పెగలలేదు. నేనంత ఇచ్చుకోలేను. రూ.10 వేలు ఇస్తానని చెప్పాడు. కానీ రూ.50వేలైనా ఇవ్వాలని అప్పన్న సర్దిచెప్పాడు. నాగరాజు రూ. 30 వేలు ఇస్తానన్నా ఒప్పుకోలేదు. ఇస్తే రూ. 50 వేలు ఇవ్వు.. లేదంటే ఇదిగో అంటూ సెల్‌ఫోన్లు తీసి కడుతున్న ఇంటి ఫొటోలు తీశారు. దానికి మరింత బిత్తరపోయి చెమటలు పట్టిన నాగరాజు ఇంటికెళ్లి తెస్తానని చెప్పి వెళ్లి షుగర్ లెవెల్స్ డౌన్ అవ్వడంతో ఒక్కసారిగా కుర్చీలో కుప్పకూలిపోయాడు.

పిల్లలను పని వద్ద పెట్టి..

నాగరాజుకు భార్య సపర్యలు చేస్తూనే తన కుమార్తెలను, మేనకోడలిని పని వద్దకు వెళ్లమని చెప్పి పంపించింది. భర్త డబ్బులిచ్చేదామన్నా.. ఎందుకివ్వాలి.. మున్సిపల్ కమిషనర్‌ను తెస్తామంటున్నారు కదా.. అతని వద్దే తేల్చుకుంటానని చెప్పి ధైర్యం చెప్పారు. ఈ లోగా అక్కడ ఉండే పనివాళ్లను కూడా బెదిరించారు. దీంతో వాళ్లు నాగరాజుకు ఫోన్ చేయగా భార్య మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో పని ఆపవద్దని ఏం జరిగినా తమదే బాధ్యత అని నాగరాజు భార్య చెప్పడంతో రాత్రి 2 గంటలకు కంప్లీట్ చేశారు. ఈ లోగా 100కు డయల్ చేయడంతో రెండో పట్టణ పోలీసులు ఘటనాస్థలికి వచ్చి మాట్లాడారు. తమ పిల్లలు పని దగ్గర ఉండటం, వచ్చిన వారు అక్కడి నుంచి కదలకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యామని బాధితులు చెప్పడం విశేషం. ఈ ఘటనపై రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు వద్ద ప్రస్తావించగా బొడ్డు కృష్ణారావు, తిత్తి ప్రవీణ్, డోల అప్పన్న, వాసు, మరో వ్యక్తిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గతంలోనూ..

గతంలో కూడా ఈ పత్రికా విలేకరులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. రూరల్ మండలం సింగుపురం పంచాయతీలో ఓ భూవివాదంలో తలదూర్చి భూ యజమానిని బెదిరించడంతో అప్పన్న, ప్రవీణ్ ముఠాపై సంబంధిత యజమాని పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో ఆయన ప్రైవేటు కేసు పెట్టారు. తాజాగా జీఎస్టీ అధికారులమని చెప్పి దళిత స్వీట్‌షాపు యజమాని రేజేటి సామ్యను బెదిరించడంతోపాటు రూ. 2 లక్షలు డిమాండ్ చేయడంతో రెండో పట్టణ పీఎస్‌లో అప్పటి సీఐ ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేశారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని.. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ వివేకానంద హెచ్చరించారు.

దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం


అభ్యర్థుల ఎత్తు పరిశీలిస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి


రన్నింగ్ ట్రాక్‌పై అభ్యర్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన ఈ ఎంపిక ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. దేహదారుఢ్య పరీక్షల్లో ఎంపికైనవారికి అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో జిల్లాలో 7,390 మంది పురుష, మహిళా అభ్యర్థులు అర్హత సాధించారు. సెలవు రోజులు మినహా జనవరి 18వ తేదీ వరకు నిర్వహించే ఎంపికలకు ఈ అభ్యర్థులు హాజరు కానున్నారు. కాల్ లెటర్లు ఆధారంగా అభ్యర్థులకు ఎంపికలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఈ ఎంపికలను పర్యవేక్షిస్తున్నారు. సీసీ కెమెరాల నిఘా, సెన్సార్ల వినియోగంతో ఫిజికల్ మెజర్మెంట్ (పీఎంటీ), ఫిజికల్ ఏఫిషియన్స్ (పీఈటీ) పరీక్షలు నిర్వహిస్తున్నారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్, బయోమెట్రిక్ అథంటికేషన్, ఛాతీ, ఎత్తు కొలతల అనంతరం 100 మీటర్లు, 1,600 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్‌లు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు మైదానంలో అడుగు పెట్టిన నుంచి బయటకు వచ్చే వరకు నిఘా పెట్టారు. పోలీస్ అధికారులు మైదానం లోపల, బయట పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ, అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. సోమవారం ఈవెంట్స్‌కు 600 మందిని పిలివగా, 322 హాజరయ్యారు. వీరిలో 192 మంది అర్హత సాధించారు.

ఆరుగురిపై గృహ హింస కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని బడివానిపేట పంచాయతీ జాలారుకొయ్యాం గ్రామానికి చెందిన మహిళ మారుపల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఎచ్చెర్ల పోలీసులు ఆరుగురిపై గృహహింస కేసు నమోదు చేశారు. ఈమె భర్త సత్యం కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. ప్రస్తుతం అత్త టిట్టమ్మ, మరో ఐదుగురు కుటుంబ సభ్యులు రోజూ హింసిస్తున్నారని ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

గంజాయితో ఇద్దరు వ్యక్తులు అరెస్టు


మాట్లాడుతున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి అక్రమంగా ఉత్తరప్రదేశ్‌కి 11.430 కేజీల గంజాయిని తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. సీఐ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్రం మాణిక్యపూర్ ఏరియా బడగడకు చెందిన అపాలోమండల్ నుంచి 11.430 కేజీల గంజాయిని కొనుగోలు చేసి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి తరలించేందుకు ఒడిశా నుంచి వస్తుండగా ఎల్‌సీగేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు సోమవారం పట్టుబడ్డారు. పట్టుబడినవారిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్ జిల్లా ఝుందాపూర్ గ్రామానికి చెందిన అజయ్, అదే రాష్ట్రానికి చెందిన బులంద్‌షహర్ జిల్లా సుజనా గ్రామానికి అజయ్‌సింగ్ ఉన్నారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరు ఉత్తరప్రదేశ్‌లో గంజాయి వ్యాపారం చేస్తున్న సోను అనే వ్యక్తికి గంజాయిని అందజేసేందుకు తీసుకెళ్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గంజాయి అక్రమ రవాణా జరగకుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్న స్థానిక ఇచ్ఛాపురం పోలీస్ సిబ్బందిని ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి అభినందించినట్లు సీఐ వెల్లడించారు. ఇందులో రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌కే రక్షణ లేకుండా పోయింది

- దాడులను మత్స్యకారులందరూ ఖండించాలి
- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త తిలక్


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పేరాడ తిలక్

సంతబొమ్మాళి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సర్పంచులకే రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో సర్పంచ్ జోగి రాములమ్మకు చెందిన 180 కొబ్బరి మొక్కలను అధికార పార్టీ ఒత్తిడితో తొలగించిన సంఘటన స్థలాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ నాయకుల దాడులతో తన గ్రామంలో సర్పంచ్‌గా జీవించడానికి ఎంత కష్టంగా మారిందో తెలుస్తోందన్నారు. తీరప్రాంత మత్స్యకారులకు తంపర భూములు జీవనోపాధిని కల్పించేవిగా తరతరాలుగా వస్తున్నాయన్నారు. అలాంటి భూముల్లో సాగు చేసిన మొక్కలను దౌర్జన్యంగా తొలగించి వారి జీవనోపాధిపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

మంత్రి అచ్చెన్న ప్రోద్బలంతోనే...

మంత్రి అచ్చెన్నాయుడు ప్రోద్బలంతోనే స్థానిక టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ పుక్కళ్ల శ్రీనివాసరావు దాడులు చేయడానికి రెచ్చిపోతున్నాడని తిలక్ మండిపడ్డారు. సర్పంచ్ రాములమ్మను బహిరంగ సమావేశంలో చంపేస్తానంటూ శ్రీనివాసరావు చెదిరించడంపై చర్యలు తీసుకోవాలన్నారు. రాములమ్మకు చెందిన ఆక్వా చెరువులకు విద్యుత్ కట్ చేయించడం, అమె అస్తులపై దాడులు చేయించడం తగదన్నారు. రెవెన్యూ, పోలీస్ వ్యవస్థలను తమ గుప్పెట్లో పెట్టుకుని మొన్న దండుగోపాలపురంలో, నిన్న జగన్నాథపురంలో దాడులు చేసి కేసులు పెట్టి గ్రామాల్లో లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఇలాగే దాడులు కొనసాగిస్తే ప్రతి దాడులు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఉన్న మత్స్యకారులందరూ సర్పంచ్ రాములమ్మ గ్రామానికి వచ్చి ఆమెకు బాసటగా నిలవాలని కోరారు. రాములమ్మ తప్పు చేసిందని మత్స్యకార సోదరులు భావిస్తే ఆమె వెంటనే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తుందన్నారు. దాడులపై జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించాలని డిమాండ్ చేశారు. ఆయనతోపాటు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, బావనపాడు సర్పంచ్ బి.మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణరావు, లండ రామారావు, రాహుల్‌కుమార్, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

ఇసుక లారీలతో ఇబ్బందులు


చీడివలస వద్ద దిగబడిన లారీలు

బూర్జ: మండలంలోని మామిడివలస పంచాయతీ కాఖండ్యాం ఇసుక ర్యాంపు నుంచి ఇసుక తరలించే లారీల వలన స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం చీడివలస గ్రామం దిగువున గెడ్డవద్ద లారీలు దిగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిత్యం ఇలాగే జరుగుతోందని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



ఘటన స్థలంలో పడివున్న బొండాడ రామారావు మృతదేహం

కంచిలి, సోంపేట: మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధి బాసుబంజిరి గ్రామానికి చెందిన బొండాడ రామారావు(40) అనే వ్యక్తి కంచిలి జాతీయ రహదారి పక్కన ఉన్న పట్జీ దాబా వెనుక పొలాల్లో సోమవారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడు రామారావు ఉదయం తనకు చెందిన మేకలను ఆహారం కోసం చెట్టు కొమ్మలు తీసుకురావడానికి వెళ్లి, అక్కడ పొలాల్లోకి అడవి పందులు రాకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగను తాకడంతో ప్రమాదవశాత్తు షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఇతనికి భార్య రేణు, ఇద్దరు పిల్లలు శ్రావణ్, చరణ్ ఉన్నారు. ఇంటి యజమాని మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

సంఘటన స్థలం పరిశీలన

ఇదిలా ఉండగా సోంపేట సీఐ బి.మంగరాజు, బారువ ఎస్ఐ హరిబాబునాయుడు, సిబ్బంది సంఘటన స్థలానికి విచ్చేసి పరిస్థితిని సమీక్షించారు. మృతుడు పొలంలోకి వచ్చిన మార్గాన్ని, షాక్ కొట్టి పడిపోయి ప్రాణాలు విడిచిన చోటును పరిశీలించారు. కాగా రామారావు మృతి చెందడంతో స్వగ్రామం బాసుబంజిరిలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోంపేట ఇన్‌చార్జి ఎస్ఐగా ఉన్నటువంటి బారువ ఎస్ఐ హరిబాబునాయుడు ప్రమాదవశాత్తూ మృతి చెందినట్లు కేసు నమోదు చేశారు.

చెరుకు తోట దగ్ధం


జి.సిగడాం: దగ్ధమవుతున్న అప్పలదాసు దుకాణం

బూర్జ: మండలంలోని వావాం గ్రామంలో చెరుకు తోట సోమవారం అగ్నికి ఆహుతైంది. పాలకొండ అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసినట్లు అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు తెలియజేశారు. వావాం గ్రామ పరిధిలో గొలివి సూరపునాయుడికి చెందిన సుమారు ఎకరా ఇరవై సెంట్ల చెరుకు పంట అగ్ని ప్రమాదానికి గురైంది. దీంతో తనకు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలియజేశారు. పక్కనే ఉన్న కొట్టివేసిన చెరుకు తోటకు నిప్పుపెట్టగా, ఈ తోటకు అంటుకుందని వెల్లడించారు.

దుకాణంలో అగ్నిప్రమాదం

జి.సిగడాం: మండలంలోని చంద్రయ్యపేట గ్రామంలో సోమవారం తెల్లవారుజామున కర్రి అప్పలదాసుకు చెందిన దుకాణం అగ్నికి ఆహుతైంది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని బాధితుడు విలపిస్తున్నాడు. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని అప్పలదాసు తెలిపారు.

ముగిసిన ఆవిష్కార్ హేకతాన్


విజేతలకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న కళాశాల యాజమాన్యం తదితరులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఆవిష్కార్ హేకతాన్ జాతీయ స్థాయి సాంకేతిక కార్యక్రమం సోమవారంతో ముగిసింది. సుమారు 19 రాష్ట్రాల నుంచి 51 ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 186 మంది విద్యార్థులు హాజరై సాంకేతిక ప్రతిభను చాటుకున్నారు. దీనిలో శ్రీఈశ్వర్ కళాశాల కోయంబత్తూరు విద్యార్థులు రూపకల్పన చేసిన ఆక్వానీటి యంత్రం ద్వారా నీటిని సేకరించడం ఆలోచనకు మొదటి బహుమతిగా రూ.1.25 లక్షలు అందుకున్నారు. విజయనగరం మహారాజా కళాశాల విద్యార్థులు రూపకల్పన చేసిన రిజర్వేషన్ టికెట్ల రీసైక్లింగ్ ఆలోచనకు రెండో బహుమతిగా రూ.1 లక్ష కైవసం చేసుకున్నారు. ముంబైకు చెందిన ఏసీ పటేల్ కళాశాల విద్యార్థులు రూపకల్పన చేసిన ఏఐ ఉపయోగించి బోధన, పరీక్ష విధానంలో మార్పులు అనే ఆలోచనకు మూడో బహుమతిగా రూ.75 వేలు అందుకున్నారు. వీరితో పాటు ఐతమ్, ఎస్‌వీఎస్ఐటీ సూరత్ కళాశాల విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు సాధించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు, స్టార్టప్ మెంటార్ మనోజ్‌కుమార్ బడగర్‌వాలా, డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు చేతుల మీదుగా విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు సందీప్ బత్తుల, సుస్మా బడగర్‌వాలా, డీన్లు జి.సతీష్‌కుమార్, ఎం.వి.ఎస్.కుమార్, జె.సురేష్‌కుమార్, గిరీష్‌కుమార్, సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీడబ్ల్యూఎస్ డైరెక్టర్‌గా లోహిత్


తామాడ లోహిత్

పలాస: మండలంలో బొడ్డపాడు గ్రామానికి చెందిన తామాడ లోహిత్ అండమాన్‌లోని సీసీడబ్ల్యూఎస్ ప్రభుత్వ శాఖ డైరెక్టర్‌గా అత్యధిక మెజారిటీతో గెలిపొందాడు. బతుకు తెరువు కోసం వెళ్లి అక్కడ స్థిరపడి ఉద్యోగం చేస్తున్న ఆయనను అక్కడి ప్రజలు తమ అక్కున చేర్చుకున్నారు. ఈవిధంగా అతను ప్రజలకు తగిన సేవలను అందించాలని అండమాన్‌లోని బొడ్డపాడు యువజన సేవా సంఘం అభినందనలు తెలిపింది. అలాగే తెలుగు యువత పలాస మండల శాఖ అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, బొడ్డపాడు గ్రామ పెద్దలు, ప్రజలు కూడా అభినందనలు తెలిపారు.

బయటపడిన మోసం

- నకిలీ బ్యాంకు రశీదుల వ్యవహారంపై విచారణ
- సీఎఫ్ సొంత అవసరాలకు వాడుకున్నట్లు తేటతెల్లం


గ్రామంలో విచారిస్తున్న వెలుగు అధికారులు

టెక్కలి: మండలంలోని గూడేం పంచాయతీ పిట్టలసరియా గ్రామానికి చెందిన వెలుగు సీఎఫ్ గంగయ్య అటు స్వయం సహాయక సంఘాల సభ్యులకు, ఇటు యూనియన్ బ్యాంకుకు చేసిన మోసం బాధిత సభ్యుల సమక్షంలో బహిర్గతమైంది. ఈ మేరకు ఇటీవల సాక్షిలో ప్రచురితమవుతున్న కథనాలకు స్పందించి సోమవారం వెలుగు సీసీ కె.శ్రీరాములు, ఏపీఎం ఉమారాణి తదితరులు బ్యాంకు స్టేట్‌మెంట్ పత్రాలతో సహా పిట్టలసరియా గ్రామంలో విచారణ చేపట్టారు. అయితే విచారణలో భాగంగా సీఎఫ్ గంగయ్య చేసినటువంటి మోసం సభ్యులను ఆశ్చర్యానికి గురి చేసింది. యూనియన్ బ్యాంకులో తీసుకున్న రుణానికి సంబంధించి నెలవారీ వాయిదాల చెల్లింపుల విషయంలో సభ్యులు సీఎఫ్‌కు ఇచ్చినటువంటి వాయిదా డబ్బులను సొంత అవసరాలకు వినియోగించుకుని, నకిలీ బ్యాంకు రశీదులను సభ్యులకు చూపించి పెద్ద ఎత్తున మోసానికి పాల్పడిన విషయం తేటతెల్లమైంది. దీనిపై వెలుగు అధికారులు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులకు, బ్యాంకుకు మోసం చేసిన సీఎఫ్ గంగయ్యను విధుల నుంచి నిలిపివేసినట్లు పేర్కొన్నారు. అయితే శాఖాపరంగా ప్రాథమిక చర్యలు తీసుకున్నప్పటికీ బ్యాంకుపరంగా ఎటువంటి చర్యలు తీసుకుంటారో బ్యాంకు సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంది.